సాక్షి
పల్నాడు
బుధవారం । 1 । అక్టోబర్ । 2025





### ఆంజనేయ విగ్రహ పునఃప్రతిష్ట

వెల్దుర్తి: వజ్రాలపాడు సమీపంలోని చెరువులో వెంచేసి ఉన్న వీరాంజనేయ స్వామి వారి విగ్రహ పునః ప్రతిష్ట కార్యక్రమం మంగళవారం వైభవంగా నిర్వహించారు.



### ఇంద్రకీలాద్రిపై వేదసభ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాలను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో మంగళవారం వేదసభ నిర్వహించారు. 450 మంది వేద పండితులు పాల్గొన్నారు.

### 9వ రోజు ఆదాయం రూ.40.12 లక్షలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా ఉత్సవాల్లో 9వ రోజైన మంగళవారం దుర్గగుడికి రూ.40.12 లక్షల మేర ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు తెలిపారు. 2.29 లక్షల లడ్డూలను విక్రయించామని వివరించారు.

## న్యూస్‌రీల్

### ఎన్‌జీజీఓ ఎన్నికలు వెంటనే పూర్తిచేయండి



నరసరావుపేట: ఏపీ ఎన్‌జీజీఓ పల్నాడు జిల్లా శాఖ ఎన్నికలు వెంటనే పూర్తి చేయాలని గుంటూరు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు అడహాక్ కమిటీ సభ్యులకు సూచించారు. మంగళవారం ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణంలో అడహాక్ కమిటీ చైర్మన్ రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అన్ని తాలూకా యూనిట్ల ఎన్నికల ప్రక్రియ గురించి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యదర్శి ఎస్.శ్యాంసుందర శ్రీనివాస్ మాట్లాడుతూ అన్ని తాలూకా యూనిట్ల సభ్యత్వాలను వెంటనే పూర్తి చేయాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్, అడహాక్ కమిటీ సభ్యులు, తాలూకా యూనిట్ల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

### షటిల్ టోర్నమెంట్‌లో విజేతగా శ్రీసూపర్ కింగ్స్



గుంటూరు మెడికల్: గుంటూరులో వైద్యుల షటిల్ టోర్నమెంట్ పోటీలు మంగళవారం విజయవంతంగా జరిగాయి. గుంటూరు అమరావతి రోడ్డులో జరిగిన షటిల్ టోర్నమెంట్‌లో వంద మందికి పైగా వైద్యులు పాల్గొన్నారు. పోటీల్లో విజేతగా శ్రీసూపర్‌కింగ్స్ నిలిచారు. గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ కె.కళ్యాణ్ చక్రవర్తి కెప్టెన్‌గా ఆడిన షటిల్ టోర్నమెంట్‌లో కార్డియాలజిస్ట్ డాక్టర్ బి.వి.నారాయణరెడ్డి, స్పైన్ సర్జన్ డాక్టర్ డి.శ్రీకాంత్‌రెడ్డి, డాక్టర్ రాజశేఖర్‌లు టీమ్‌గా ఆడి కప్పు గెలుచుకున్నారు. ఫైనల్‌లో సందీప్ స్ట్రైకర్స్ టీమ్‌ను 3.1 తేడాతో ఓడించి శ్రీసూపర్ కింగ్స్ విజేతగా నిలిచారు. శ్రీ సూపర్ కింగ్స్ టీమ్ వైద్యులకు పలువురు వైద్యులు అభినందనలు తెలిపారు.

### డాక్టర్ ధాత్రికుమారి సాహిత్య సేవలు అభినందనీయం



గుంటూరు ఎడ్యుకేషన్: తెలుగు అధ్యాపకురాలిగా, పరిశోధకురాలిగా వివిధ ప్రక్రియల్లో సాహిత్య సృష్టి చేస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్న డాక్టర్ ధాత్రికుమారి జాషువా సాహిత్య పురస్కారానికి అర్హురాలని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. విశ్వ నరుడు జాషువా సేవా సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో విశ్వకవి గుర్రం జాషువా 130 వ జయంతి ముగింపు సభ లో భాగంగా మంగళవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో డాక్టర్ ధాత్రికుమారికి జాషువా సాహితీ పురస్కారం అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జాషువా సాహిత్యం అజరామరం అన్నారు. కుల దురహంకారం పై, మహిళా అభ్యున్నతి కోసం అలుపెరగని పోరాటం చేసిన జాతీయ కవి అని కొనియాడారు. సభకు సంస్థ అధ్యక్షుడు ముట్లూరి వెంకయ్య అధ్యక్షత వహించిన కార్యక్రమంలో టి. మహతి బాలాజీ, ఆర్. నరసింహారావు, ఎ. కిరణ్, ప్రభుదాసు కే రామారావు, ఐ. నరసింహారావు, కే. విల్సన్ రావు తదితరులు పాల్గొన్నారు.

### జలదిగ్బంధంలో మత్స్యకారుల కాలనీ



దాచేపల్లి: మండలంలోని రామాపురం మత్స్యకారుల కాలనీ రెండు రోజులుగా జలదిగ్బంధంలోనే ఉంది. మంగళవారం కూడా కృష్ణానది వరద ఉధృతి తగ్గలేదు. దీంతో కొంత సామగ్రిని సురక్షిత ప్రాంతాలకు తరలించగా మరికొన్నింటిని ఇళ్లపై భద్రపరిచారు. వరద ఉధృతి తగ్గకపోవటంతో పునరావాస కేంద్రంలోనే తలదాచుకుంటున్నారు. వరదకు పత్తి, మిరప పంటలు నీట మునిగాయి. మండలంలోని పొందుగల వద్ద కృష్ణానది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇక్కడ కూడా పొలాలు నీట మునిగాయి.



దుర్గాదేవి అలంకారంలో బాలచాముండేశ్వరి అమ్మవారు



వినుకొండలోని శంకర సత్సంగంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న కన్యలు



లింగారావుపాలెం శివాలయంలో వనదుర్గాదేవి అలంకారంలో పార్వతీదేవి



సత్తెనపల్లిలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రీదుర్గాదేవిగా...

### దేవతాస్వరూపిణి దుర్గమ్మ

జిల్లా వ్యాప్తంగా దేవి శరన్నవరాత్ర్యుత్సవాలను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. ఉత్సవాలలో భాగంగా అమరావతిలోని బాల చాముండిక సమేత అమరేశ్వరాలయంలో మంగళవారం బాలచాముండేశ్వరి అమ్మవారిని దుర్గతులను రూపుమాపే దుర్గాదేవిగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై దుర్గాదేవిని దర్శించి పూజలు నిర్వహించారు. వినుకొండలోని శంకర సత్సంగంలో కన్యలు పూజలు నిర్వహించారు. యడ్లపాడు మండలం లింగారావుపాలెంలోని శివాలయంలో వనదుర్గాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. సత్తెనపల్లిలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవి అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. – అమరావతి/వినుకొండ/సత్తెనపల్లి/యడ్లపాడు

# ప్రభుత్వ తీరుపై ప్రజలు రోడ్డెక్కాలి

**ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో నిరసన**

- వైఎస్సార్ సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొల్లా
- డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన
- ప్రభుత్వ సొమ్ము ప్రైవేటుకు ఎలా అమ్ముతావంటూ నిలదీత



డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద రోడ్డుపై కూర్చొని నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి, బొల్లా, ఎస్సీ సెల్ నాయకులు

నరసరావుపేట: ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకోవడానికి సిద్ధపడిన కూటమి ప్రభుత్వ చర్యలను ప్రజలు వ్యతిరేకిస్తూ రోడ్డు ఎక్కాలని వైఎస్సార్ సీపీ మాజీ ఎమ్మెల్యేలు పిలుపుఇచ్చారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు కొమ్ము చంద్రశేఖర్ ఆధ్వర్యాన ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటుకరణను వ్యతిరేకిస్తూ మంగళవారం నరసరావుపేటలోని గడియారం స్తంభం సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్టీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పీఏసీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు హాజరయ్యారు. ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు కొమ్ము చంద్రశేఖర్, నాయకులు, కార్యకర్తలతో కలిసి విగ్రహం చుట్టూ నిరసన ప్రదర్శన చేశారు. విగ్రహం ముందు కూర్చుని ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ గోపిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్మాణం చేపట్టిన 17 మెడికల్ కళాశాలలను చంద్రబాబు కోట్ల రూపాయల లంచాలకు ఆశపడి తన అనుచరులకు ధారాదత్తం చేస్తున్నాడని విమర్శించారు. పేదలు తమ పిల్లల్ని డాక్టర్లుగా చేయాలనే కలలను వమ్ము చేస్తూ చంద్రబాబు ప్రైవేటుపరం చేయటం వలన ఒక్కొక్క విద్యార్థి రూ.కోటి నుంచి రూ.2కోట్లు ఖర్చుచేసి చదువుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతుందన్నారు. మన రాష్ట్రంలో చదువుకునే అవకాశం లేక ఇతర దేశాలు, రాష్ట్రాలకు మన రాష్ట్ర విద్యార్థులు తరలి వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మనమే ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేసుకుంటే రూ.30 నుంచి రూ.40 లక్షలకే తమ పిల్లల్ని డాక్టర్లుగా చదివించుకునే అవకాశం పేద, మధ్యతరగతి వర్గాలకు ఉంటుందన్నారు. పేద తల్లిదండ్రుల కలను సాకారం చేసేందుకు దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా 17 మెడికల్ కళాశాలలను రాష్ట్రానికి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చి రూ.8500 కోట్లతో నిర్మాణం చేశారని అన్నారు. వీటిలో ఐదు మెడికల్ కళాశాలలు ఇప్పటికే ప్రారంభం చేశారని, మరో ఐదు కళాశాలలు తుది దశలో ఉన్నాయని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో రాగానే మాకు మెడికల్ కళాశాలు, సీట్లు వద్దని కేంద్రానికి లేఖ రాశారని, ఇది చాలా దుర్మార్గమైన విషయమని అన్నారు. ఈ కళాశాలల్ని ప్రైవేటుపరం చేసి ప్రతి మెడికల్ కళాశాలలో 100 సీట్లలో 50 సీట్లు ప్రైవేటుగా అమ్ముకోవడానికి సిద్ధపడ్డాడని, ఒక్కొక్క సీటు రూ.2కోట్లు చొప్పున రూ.1500 కోట్లు దండుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవటం దుర్మార్గమైన చర్య అన్నారు. ముఖ్యమంత్రివి అయినంత మాత్రాన ప్రజల సొమ్ము ఏవిధంగా అమ్ముతాడని ప్రశ్నించారు. తిరిగి తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రైవేటీకరణ చేస్తున్న మెడికల్ కళాశాలలను తిరిగి ప్రభుత్వం పరం చేస్తామని హెచ్చరించారు.




గడియారం స్తంభం సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం చుట్టూ నినాదాలు చేస్తూ ప్రదర్శన చేస్తున్న ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షులు కొమ్ము చంద్రశేఖర్, నాయకులు

### పవన్ ఎందుకు మాట్లాడడం లేదు

పేద వర్గాల కోసం పార్టీ పెట్టానని చెప్పుకుంటున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేద వర్గాల కోసం తీసుకొచ్చిన 17 మెడికల్ కళాశాలలను చంద్రబాబు ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముతుంటే ఎందుకు మాట్లాడట్లేదని పీఏసీ సభ్యులు, వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రశ్నించారు. పేదవాడి కోసం ఒక్క మాట మాట్లాడే ధైర్యం కూడా నీకు లేదా అని పవన్‌ను ఉద్దేశించి అన్నారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు రాష్ట్రానికి ఒక్క మెడికల్ కళాశాల అయినా తీసుకు వచ్చారా అని ప్రశ్నించారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆలోచనలు చంద్రబాబు వెనక్కి తీసుకోకపోతే అతనికి పుట్టగతులు ఉండవని అన్నారు.

### దళితులకు వైద్య విద్యను దూరం చేస్తున్న బాబు

ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షులు కొమ్మూరు చంద్రశేఖర్ మాట్లాడుతూ దళితులు, పేదవర్గాల కోసం తీసుకొచ్చిన మెడికల్ కళాశాలలను చంద్రబాబు ప్రైవేట్ వ్యక్తులకు అమ్మకోవడం దారుణమని అన్నారు. దళితులకు వైద్య విద్యను దూరం చేస్తే చూస్తూ ఊరుకోబోమని, ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు గుజ్జర్లపూడి ఆకాష్‌కుమార్, ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందుల ఎజ్రా, రాష్ట్ర కార్యదర్శి చిలకా జాన్‌పాల్, జిల్లా కార్యదర్శి ఎస్.సుజాతాపాల్ మాట్లాడారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి ఉప్పుతోళ్ల వేణు మాధవ్, డ్వాక్రా విభాగం జిల్లా కార్యదర్శి హెల్డా ఫ్లారెన్స్, సోషల్ మీడియా కన్వీనర్ బూదాల కల్యాణ్, పట్టణ కార్యదర్శి కుక్కల పొలయ్య, రొంపిచర్ల మండల నాయకుడు గుండాల వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సాతులూరి రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు చిలకా శ్రీకాంత్, కారంపూడి మండల ప్రధాన కార్యదర్శి మురికిపూడి నాగ మోషే, ఎస్సీ విభాగం నాదెండ్ల మండల అధ్యక్షులు రాయపూడి చెంచురాజు, ప్రత్తిపాటి కోటేశ్వరరావు, చీమకుర్తి రవి, ఎస్సీ విభాగం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పండుగ వేళ.. కందిపప్పుకు మంగళం

- కందిపప్పు లేకుండా అక్టోబర్‌లో సరఫరాకు ఏర్పాట్లు
- బయట మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేస్తున్న పేదలు
- ప్రజా పంపిణీలో కూటమి ప్రభుత్వ వైఫల్యం

పేదలకు సబ్సిడీపై కందిపప్పు అందించే పద్ధతికి కూటమి ప్రభుత్వం స్వస్తి పలికింది. "ఈ నెల ఇస్తాం..వచ్చే నెల ఇస్తాం" అంటూ 16 నెలలుగా కాలం గడుపుతున్న కూటమి ప్రభుత్వం అక్టోబర్ నెలలో కూడా సరఫరాకు మంగళం పాడింది. ఈ నెలలో దసరా, దీపావళి పండుగలు ఉండడంతో కందిపప్పు ఇస్తారని పేదలు ఆశించారు. కానీ వారి ఆశలను ప్రభుత్వం నీరుగార్చింది. చివరకు కందిపప్పు లేకుండానే పండుగలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.



నరసరావుపేట టౌన్: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందించే కందిపప్పు, పామాయిల్, గోధుమలు, రాగులు, జొన్నల పంపిణీ అస్తవ్యస్తంగా తయారైంది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత పూర్తి స్థాయిలో నిత్యావసర సరుకులు పంపిణీకి నోచుకోవటం లేదు. అన్ని సరుకులు అందజేస్తే పేద కుటుంబాలకు ఆహార భద్రతతో పాటు ఆర్థిక వెసులుబాటు ఉంటుంది. చౌక దుకాణాల్లో కిలో కందిపప్పు రూ.67కు కార్డుదారులకు అందిస్తున్నారు అదే బహిరంగ మార్కెట్‌లో రూ.100 నుంచి రూ.105 వరకు పలుకుతోంది. ఏడాదికి పైగా చౌక దుకాణాల్లో కందిపప్పు అందకపోవటంతో పేదలు ఆర్థిక భారాన్ని మోస్తున్నారు. దీనికి తోడు ప్రభుత్వం నూతన రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ ప్రక్రియ ఆగస్టు నెల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించింది. రెండు రకాల యాప్‌లు ఏర్పాటు చేయటంతో సర్వర్ నెమ్మదించి సాంకేతిక సమస్యలు తలెత్తాయి. సరుకుల పంపిణీలో జాప్యం చోటుచేసుకొని కార్డుదారులు ఇప్పటికే తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

#### కందిపప్పుకు మంగళం

అక్టోబర్ నెలకు సంబంధించి బుధవారం నుంచి ప్రజా పంపిణీ ప్రారంభమవుతోంది. ఇప్పటికే ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి బియ్యం, పంచదార మాత్రమే చౌకదుకాణాలకు దిగుమతి అయ్యాయి. పండుగల సీజన్ లోనైనా ప్రభుత్వం పేదల కడుపు నిండేలా చర్యలు తీసుకుంటుందనే ఆశతో కార్డుదారులు రేషన్ దుకాణాలకు వెళ్లారు. కానీ ప్రభుత్వం కందిపప్పు అందించకపోవడం వారికి తీవ్ర నిరాశ కలిగించింది. పండుగ కోసం అదనంగా ఖర్చులు చేయాల్సి వచ్చే ఈ సమయంలో మార్కెట్‌లో కిలో రూ.100కు పైగా వెచ్చించి కందిపప్పు కొనుగోలు చేయడం పేదల జేబులకు మరింత భారమైపోయింది. కందిపప్పు నిలిచిపోవడంతో పేద కుటుంబాలు మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారు. పండుగ సీజన్‌లోనూ ఉపశమనం ఇవ్వలేకపోవడం ప్రభుత్వం వైఫల్యాన్ని కార్డుదారులు ప్రశ్నిస్తున్నారు.

### 6.34 లక్షల కుటుంబాలకు ఆర్థిక భారం

పల్నాడు జిల్లా వ్యాప్తంగా 6,34,114 రైస్ కార్డులు ఉండగా అందులో 18,36,592 మంది సభ్యులు ఉన్నారు. వారికి నెలనెలా కేజీ చొప్పున కార్డుదారులకు సబ్సిడీపై అందించాలి. వీటితోపాటు జిల్లాకు నూతనంగా అర్హత పొందిన సుమారు 13 వేల మందికి స్మార్ట్ రేషన్ కార్డులు మంజూరయ్యాయి. పాత కార్డుదారులతోపాటు నూతనంగా మంజూరైన వారికి కందిపప్పు అందించాల్సి ఉంది. అయితే ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రేషన్ దుకాణాల్లో కందిపప్పు పూర్తిగా కనుమరుగైంది. దీంతో ప్రజాపంపిణీపై కార్డుదారులు పెదవి విరుస్తున్నారు.

# 7న చలో విజయవాడకు ఫ్యాప్టో పిలుపు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) పిలుపు మేరకు ఈ నెల 7న విజయవాడలోని ధర్నా చౌక్‌లో తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని ఫ్యాప్టో రాష్ట్ర పరిశీలకులు నక్కా వెంకటేశ్వర్లు, గుత్తా శ్రీనివాసరావు, గుంటూరు జిల్లా ఫ్యాప్టో చైర్మన్ కె.నరసింహారావు పిలుపునిచ్చారు. రాష్ట్ర ఫ్యాప్టో పిలుపు మేరకు ధర్నా సన్నాహక సమావేశాన్ని మంగళవారం నగరంపాలెంలోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు.

- గుత్తా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాల నుంచి తప్పించడంతో పాటు, 12వ పీఆర్సీ, మధ్యంతర భృతి మంజూరు, పాత పెన్షన్ విధానం, ఆర్థిక బకాయిల చెల్లింపు, పెన్షనర్లకు కార్పొరేషన్ ఏర్పాటు వంటి హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు పూర్తయినా ఏ ఒక్క హామీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని తెలిపారు.
- నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉద్యోగులకు స్నేహపూరిత ప్రభుత్వమని చెబుతూనే రాష్ట్రంలోని 12 లక్షల ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సంబంధించిన ఏ ఒక్క సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించిన, చర్చించిన పరిస్థితులు లేవన్నారు.
- కె. నరసింహారావు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు దాదాపు రూ.30 వేల కోట్ల ఆర్థిక బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం రోడ్ మ్యాప్ ప్రకటించాలని కోరినప్పటికీ ఇంతవరకు స్పందన లేదన్నారు.
- సెక్రటరీ జనరల్ కె.వీరాంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి ఉపాధ్యాయ సంఘాలతో విద్యా రంగ, ఆర్థిక సమస్యలపై చర్చించి పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు.

సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు, ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మేకల సుబ్బారావు, ఫ్యాప్టో జిల్లా డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఎండీ ఖాలీద్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.కళాధర్, జి.వెంకాంగిణీ రాజు, జిల్లా నాయకులు దిబ్బయ్య, ఎం.కోటిరెడ్డి, షేక్ బాజి బాలాజీ, ప్రసాద్, విజయానంద్ పాల్గొన్నారు.




పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఫ్యాప్టో నాయకులు

## క్లుప్తంగా

### ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తు గడువు పొడిగింపు

**నరసరావుపేట ఈస్ట్:** నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష దరఖాస్తు గడువును అక్టోబర్ 15వ తేదీ వరకు పొడిగించినట్టు ప్రభుత్వ పరీక్షల సంచాలకుడు డాక్టర్ కె.వి.శ్రీనివాసులురెడ్డి మంగళవారం తెలిపారు. అభ్యర్థులు ప్రభుత్వ పరీక్షల కార్యాలయ వెబ్‌సైట్ www. bse. ap. gov. in లో తమ పేరు నమోదు చేసుకొని పరీక్ష రుసుమును 16వ తేదీలోగా చెల్లించి ప్రింటెడ్ నామినల్ రోల్, ఒరిజినల్ ఎస్‌బీఐ కలెక్ట్ రశీదును 18వ తేదీలోగా సంబంధిత జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అందచేయాలని వివరించారు. ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్, ఎంపీపీ పాఠశాలలు, వసతి లేని ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు పరీక్ష రాసేందుకు అర్హులని తెలిపారు. వివరాలకు సమీపంలోని ఎంఈఓ, డీఈఓ కార్యాలయాల్లో సంప్రదించాలని పేర్కొన్నారు.

### రెండు బైకులు, దుకాణం దహనం

**లక్ష్మీపురం:** చిరు వ్యాపారం చేసుకునే దుకాణం, రెండు ద్విచక్రవాహనాలను గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేసిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్తంభాలగరువు ప్రాంతంలోని మధుసూధనరెడ్డి అనే వ్యక్తి ఇంటి బయట భాగంలో చిన్నపాటి కొట్టును ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. దుండగులు ఆ కొట్టుకు, అదే ప్రాంతంలో శివరామ్ అనే వ్యక్తికి సంబంధించిన రెండు ద్విచక్ర వాహనాలకు నిప్పు అంటించారు. గమనించిన స్థానికుల మంటలు అదుపు చేశారు. అప్పటికే అవి దహనమయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా 'ఏల్చూరి'

**నగరంపాలెం (గుంటూరు వెస్ట్):** ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసీసీ) అధ్యక్షునిగా ఏల్చూరి వెంకటేశ్వర్లు గెలుపొందారు. అధ్యక్ష పదవికి ఏల్చూరి వెంకటేశ్వర్లు, రంగా బాలకృష్ణలు పోటీపడ్డారు. సోమవార ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరిగింది. అర్ధరాత్రి దాటేవరకు లెక్కింపు చేపట్టారు. అధ్యక్షుడిగా ఏల్చూరి వెంకటేశ్వర్లు 721 ఓట్లతో రెండోసారి గెలిచారు. రంగా బాలకృష్ణకు 65 ఓట్లు వచ్చాయి. ఏల్చూరి ప్యానెల్‌లో ముగ్గురు కార్యదర్శులు, ఉపాధ్యక్షులుగా టీఎల్‌వీ వీరాంజనేయులు, వి.వెంకటనాగిరెడ్డి తోపాటు మరో నలుగురు గెలిచినట్లు చాంబర్ శాశ్వత గౌరవాధ్యక్షుడు ఆతుకూరి

### జాతీయ అథ్లెటిక్స్‌లో కాంస్యం

**లక్ష్మీపురం:** జార్ఖండ్‌లోని రాంచీలో ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు జరిగిన 64వ జాతీయ ఓపెన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో గుంటూరు రైల్వే డివిజన్ ఉద్యోగి కాంస్య పతాకాన్ని సాధించడం అభినందనీయం అని డివిజన్ పీఆర్‌ఓ వినయ్‌కాంత్ తెలిపారు. టీటీఐగా విధులు నిర్వహిస్తున్న రష్మిశెట్టి జావెలిన్ త్రోలో పతకం సాధించారన్నారు. రష్మిశెట్టిని డీఆర్‌ఎం సుధేష్ణసేన్ అభినందించారు.

# దివ్యం.. దుర్గమ్మ దర్శనం

- వైభవంగా దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు
- వేదపఠనంతో మార్మోగిన ఇంద్రకీలాద్రి
- అమ్మ దర్శనానికి తరలివస్తున్న భవానీలు
- నేడు మహిషాసురమర్దినిగా దర్శనమివ్వనున్న దుర్గమ్మ





విద్యుత్ దీపాల వెలుగుల్లో ఇంద్రకీలాద్రి పరిసరాలు (ఇన్‌సెట్) దుర్గమ్మగా దర్శనమిచ్చిన అమ్మవారు

**ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):** దేవీశరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ మంగళవారం శ్రీదుర్గాదేవి అలంకారంలో భక్తులను కరుణించారు. లోకకంటకుడైన దుర్గమాసురుడనే రాక్షకుడిని వధించి ఇంద్రకీలాద్రిపై దుర్గాదేవిగా కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకునేందుకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజాము మూడు గంటలకు అమ్మవారికి విశేష అలంకరణ, ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. అర్ధరాత్రి ఒంటి గంట తర్వాత క్యూలైన్‌లోకి చేరిన భక్తులకు తెల్లవారుజామునే దర్శనం పూర్తయింది. మధ్యాహ్నం నుంచి వర్షం పడటంతో క్యూలైన్‌లో ఉన్న భక్తులు, అమ్మవారి దర్శనం పూర్తి చేసుకుని తిరుగు ప్రయాణమైన వారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు వీఐపీలు, సిఫార్సులతో దర్శనానికి వచ్చే వారి సంఖ్య అంతంత మాత్రంగానే కనిపించింది. మధ్యాహ్నం రెండు గంటల తర్వాత వీఐపీల తాకిడి పెరగడంతో ఆలయ ప్రాంగణంలో కాస్త గందరగోళ పరిస్థితులు కనిపించాయి. కనకదుర్గమ్మ బుధవారం శ్రీమహిషాసుర మర్దినీదేవిగా దర్శనమిస్తారు.

**ముగింపు దశకు ఉత్సవాలు**

గత నెల 22వ తేదీన ప్రారంభమైన దసరా ఉత్సవాలు గురువారంతో ముగియనున్నాయి. గురువారం శ్రీరాజరాజేశ్వరి అలంకారం, ఉదయం పది గంటలకు యాగశాలలో మహా పూర్ణాహుతితో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయి. ఉత్సవాలు ముగింపు దశకు చేరుకోవడంతో అమ్మవారి దీక్ష స్వీకరించిన భవానీల రాక ప్రారంభమైంది. దీంతో పోలీసులు, ఇటు రెవెన్యూ అధికారులు అప్రమత్తమై సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భవానీమాలధారుల రాకతో ఆలయ పరిసరాలు అరుణ వర్ణాన్ని సంతరించుకున్నాయి.

**దుర్గమ్మ సేవలో దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ**

దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరి జవహర్‌లాల్ కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈఓ శీనానాయక్ సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం, ఆలయ అధికారులు అమ్మవారి చిత్ర పటం, ప్రసాదాలను అందించారు. పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. సినీ నటి హేమ అమ్మవారిని దర్శించుకున్నారు.

**దుర్గగుడిలో నేడు**

- బుధవారం తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి అమ్మవారి దర్శనం
- ఉదయం ఆరు గంటలకు ప్రత్యేక ఖడ్గమాలార్చన
- ఉదయం 7 గంటలకు ప్రత్యేక కుంకుమార్చన
- ఉదయం 9 గంటలకు ప్రత్యేక చండీయాగం, ప్రత్యేక శ్రీచక్రనవార్చన
- సాయంత్రం 5 గంటలకు ఆదిదంపతుల నగరోత్సవం
- సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి మహా నివేదన, పంచహారతుల సేవ, వేద స్వస్తి

**విజయ దశమి రోజు అన్ని వీఐపీ దర్శనాలు రద్దు**

దసరా ఉత్సవాల్లో 11 రోజైన విజయ దశమి రోజున అన్ని వీఐపీ దర్శనాలను రద్దు చేస్తున్నట్లు ఆలయ అధికారులు ప్రకటించారు. తెల్లవారుజాము నుంచే వీఐపీ దర్శనాలు నిలిపివేయడంతో పాటు కొండపైకి వీఐపీ వాహనాలను సైతం అనుమతించేది లేదని స్పష్టంచేశారు. సర్వ దర్శనంతో పాటు రూ.100, రూ.300 టికెట్ల క్యూలైన్లలో సైతం భక్తులు ఉచిత దర్శనం కల్పిస్తున్నామని తెలిపారు.




కుంకుమ పూజలో పాల్గొన్న యువతులు



క్యూలైన్లలో బారులుతీరిన భక్తులు

### నెమలివాహనంపై ఆది దంపతులకు నగరోత్సవం

దేవీశరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీగంగా పార్వతి సమేత మల్లేశ్వర స్వామి వార్లకు నెమలి వాహనంతో నగరోత్సవం నిర్వహించారు. నెమలి కనులతో తీర్చిదిద్దిన పల్లకీపై ఆదిదంపతులు ఇంద్రగిరి వీధుల్లో విహరించారు. సాయంత్రం వర్షం పడటంతో నగరోత్సవ సేవ గంట ఆలస్యంగా ప్రారంభమైంది. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, భక్తజనుల కోలాహలం నడుమ ఊరేగింపు కనుల పండుగా సాగింది.



నెమలి పల్లకిపై ఆదిదంపతులు

## సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం

**వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఎదుట పీహెచ్‌సీ వైద్యుల నిరసన**

**నరసరావుపేట టౌన్:** తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు మంగళవారం పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. సమస్యలు పరిష్కారం కోరుతూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా పీహెచ్‌సీ వైద్యులు ఓపీ సేవలు బహిష్కరించి నిరసన చేపట్టిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు డాక్టర్ మమత ప్రియ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఓపీ సేవలు నిలిపివేశామని, అత్యవసర చికిత్సలకు సేవలందిస్తున్నామన్నారు. సుమారు 25 సంవత్సరాల నుంచి పదోన్నతులు లేక ఒకే హోదాలో సేవలందిస్తున్న వైద్యాధికారులకు న్యాయం చేయాలన్నారు. ఇన్ సర్వీస్ పీజీ కోటాను పునరుద్ధరించాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, గిరిజన ప్రాంతాల్లో సేవలందిస్తున్న వైద్యులకు 50 శాతం మూలవేతనం గిరిజన భత్యంగా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. చంద్రన్న సంచార చికిత్స కార్యక్రమానికి రూ.5 వేలు భత్యం ఇవ్వాలన్నారు. బుధవారం పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపడతామన్నారు. గురువారం విజయవాడ వైద్య శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టటం జరుగుతుందన్నారు. అప్పటికీ ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యులు రమ్య, జగన్ నరసింహారెడ్డి, రాధా కృష్ణణ్, ప్రదీప్, బాల అంకమ్మ పాల్గొన్నారు.

## సాగర్‌బాబు ఘటనపై విచారణ జరిపి న్యాయం చేస్తాం

**నరసరావుపేట రూరల్:** విద్యుత్ షాక్‌కు గురై వికలాంగుడిగా మారిన సాగర్‌బాబు ఘటనలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ ఎస్ఈ విజయ్‌కుమార్ హామీ ఇచ్చారు. జొన్నలగడ్డలోని విద్యుత్‌శాఖ ఎస్ఈ కార్యాలయం వద్ద సాగర్‌బాబు కుటుంబం గత రెండురోజులుగా నిరాహార దీక్షలు చేపట్టారు. మంగళవారం చేపట్టిన దీక్షా శిబిరాన్ని ఎస్ఈ సందర్శించి, సాగర్‌బాబు భార్య కెజియాతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు ఎస్ఈని కలిసి చర్చించారు. సాగర్‌బాబు కుటుంబం గత 17 రోజులుగా రిలే నిరాహారదీక్షలు, రెండు రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నట్టు తెలిపారు. వారి ఆరోగ్యం క్షీణిస్తుందని వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ ఘటనలో విద్యుత్ అధికారులకు ఎలాంటి సంబంధం లేదని గ్రామ పెద్దలు రాతపూర్వకంగా ఇచ్చారని ఎస్ఈ తెలపగా.. రెండున్నర సంవత్సరాల క్రితం ఘటన జరిగితే ఇప్పుడు నకిలీ లెటరు తీసుకువచ్చి చూపడం సరికాదని, ప్రజాసంఘాల నాయకులు తెలిపారు. సాగర్‌బాబుకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై శాఖాపరంగా విచారణ జరిపి న్యాయం చేస్తామని ఎస్ఈ హామీ ఇచ్చారు. దీంతో సాగర్‌బాబు కుటుంబసభ్యులు రిలే నిరాహార దీక్షలను విరమించారు. కార్యక్రమంలో పీడీఎం నాయకులు వై.వెంకటేశ్వర్లు, నల్లపాటి రామారావు, జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, కార్యదర్శి జి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ ఎస్ఈ విజయ్‌బాబుకు వినతి పత్రం అందజేస్తున్న సాగర్‌బాబు భార్య కెజియా



## మద్యం మత్తులో కారుతో హల్‌చల్

- బొలెరోతో అడ్డొచ్చిన వారిని ఢీకొన్న వాహనదారుడు
- నలుగురికి తీవ్ర గాయాలు
- ద్విచక్ర వాహనాన్ని ఢీకొని అర కిలోమీటర్ వరకు లాక్కెళ్లిన వైనం
- పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన స్థానికులు



ద్విచక్ర వాహనాన్ని లాక్కెళుతుండడంతో నిప్పు రవ్వలు వెదజల్లుతున్న దృశ్యం



వాహనం నడిపిన సైదావలిని పోలీసులకు అప్పజెప్పిన స్థానికులు

**పిడుగురాళ్ల:** మద్యం మత్తులో బొలెరో వాహనాన్ని నడుపుతూ వాహనాలు, పాదచారులపైకి దూసుకుపోయిన ఘటన పిడుగురాళ్ల పట్టణ సమీపంలోని అయ్యప్ప నగర్ వద్ద మంగళవారం రాత్రి జరిగింది. సేకరించిన వివరాలు ప్రకారం.. సైదావలి అనే యువకుడు పూటుగా మద్యం తాగి బొలెరో వాహనం నడుపుతూ దాచేపల్లి వస్తున్నాడు.. ఈక్రమంలో పిడుగురాళ్ల అయ్యప్పనగర్ వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాల తో పాటు పాదచారుల పైకి దూసుకుపోయాడు. మద్యం మత్తులో విచక్షణ కోల్పోయిన యువకుడు హైవేపై కొద్ది నిమిషాల పాటు హల్‌చల్ చేశాడు. ఈ ఘటనలో నలుగురికి గాయాలు కాగా ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు తెలిపారు. రోడ్డు పక్కన ద్విచక్ర వాహనం నిలిపి పక్కన మాట్లాడుతున్న వ్యక్తిని బొలెరోతో ఢీకొనడమే కాకుండా ఆ ద్విచక్ర వాహనాన్ని రోడ్డుపై ఈడ్చుకుంటూ అర కిలోమీటర్ దూరం వరకు వెళ్లాడు. వేగంగా వాహనం దూసుకుని పోవడంతో రోడ్డుపై నిప్పు రవ్వలు చెలరేగాయి. ఈ ఘటన చూసిన స్థానికులు భయాందోళనకు గురయ్యారు. గాయపడిన వారిలో నరసరావుపేటకు చెందిన ఓ వ్యక్తికి కాలు పూర్తిగా దెబ్బతింది. అతన్ని వెంటనే నరసరావుపేటలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ తరలించినట్లు తెలిసింది. మిగిలిన వారిని పిడుగురాళ్ల పట్టణంలో ప్రైవేట్ హాస్పటల్‌లో చేర్పించారు. ఈక్రమంలో ఆ వాహనాన్ని అడ్డుకునేందుకు స్థానికులు విశ్వప్రయత్నం చేశారు. ఎట్టకేలకు పలువురు యువకుల సాయంతో బొలెరో వాహనాన్ని ఆపారు. అనంతరం మద్యం మత్తులో ఉన్న సైదావలికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. గాయపడ్డ వారిని 108 ద్వారా పిడుగురాళ్ల ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. ఈ ఘటనతో అద్దంకి -నార్కెట్‌పల్లి హైవేపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు సమాచారం తెలుసుకొని సంఘటనా స్థలానికి చేరుకున్న ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. వాహనం నడిపిన సైదావలిని అదుపులో తీసుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివ నాగరాజు తెలిపారు.





యడ్లపాడు మండలం కొత్తపాలెం రెవెన్యూ పరిధిలోని చౌడవరం గ్రామ శివారున ఉన్న క్వారీ కుంటలో మంగళవారం ఈతకు వెళ్లి గల్లంతైన బాలుడు షేక్ మాబు మృతదేహాన్ని వెలికితీసిన యడ్లపాడు పీఎస్ కానిస్టేబుల్ ప్రవీణ్, మిత్రబృందం. మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ టి.శివరామకృష్ణ - యడ్లపాడు

## రూ.వంద కోసం ఘర్షణ.. కత్తితో దాడి

**తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చేరిన యువకుడు**

**పిడుగురాళ్ల:** వందరూపాయల కోసం ఇద్దరి వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణ కత్తితో దాడి చేసుకునేంతగా వెళ్లిన సంఘటన పిడుగురాళ్ల పట్టణంలో చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం... పట్టణంలోని హైస్కూల్ కాంప్లెక్స్‌లోని వీరభద్ర చికెన్ షాప్‌లో జానీబాషా, రియాజ్ అనే ఇద్దరు పని చేస్తూ ఉంటారు. జానీబాషా రియాజ్‌కు రూ.100 ఇవ్వాల్సి ఉంది. ఈ విషయమై రియాజ్ అడగ్గా.. తనకు అంతకు ముందు రూ. 300 ఇవ్వాలని అవి ఇస్తే.. రూ.వంద ఇస్తానని జానీబాషా చెప్పటంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఇద్దరు తోపులాట చేసుకుంటుండగా రియాజ్ వెంటనే పక్కనే మేక తోలు తీసే కత్తితో జానీబాషా పొట్టలో పొడిచాడు. జానీబాషా పొట్టలో నుంచి పేగులు బయటకు రావటంతో వెంటనే స్థానికులు ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్పించారు. పట్టణ ఎస్ఐ శివనాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడిని షేక్ జానీబాషా

## అలరించిన 'మోహినీ భస్మాసుర'

**తెనాలి:** పురాణగాథ 'మోహినీ భస్మాసుర' పద్యనాటకంగా పండిత పామరులను అలరిస్తూనే ఉంది. తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో జరుగుతున్న వీణా అవార్డ్స్-2025 జాతీయ పంచమ పద్యనాటక, సాంఘిక నాటక/నాటికల పోటీల్లో నాలుగో రోజైన మంగళవారం తొలి ప్రదర్శనగా ఈ నాటకం అలరించింది. విజయనగరానికి చెందిన అక్కినేని సాంస్కృతిక సమాజం ప్రదర్శించగా, వీక్షకుల కరతాళధ్వనులను అందుకుంది. వృకాసురుడనే రాక్షసుడు అయిదేళ్లపాటు భీకర తపస్సు చేయటంతో శివుడు ప్రత్యక్షమై, అడిగినదే తడవుగా ఎవరి తలపైనయినా చేయి పెట్టిన వెంటనే అతడు భస్మమయేలా, ఎవరివల్ల కూడా వృకాసురుడికి మరణం లేకుండా వరాలిస్తాడు. ఈ వరాలతో జరిగే కీడు తెలిసిన నారదుడు రెచ్చగొట్టటంతో వరాన్ని పరీక్షించుకునేందున వృకాసరుడు నేరుగా శివుడు దగ్గరకు వెళతాడు. శివుడు తప్పించుకుని శ్రీవిష్ణువును శరణు వేడతాడు. విష్ణువు నారదుడిని సంప్రదించి, మోహినీరూపం దాల్చి వృకాసురుని అంతమొందించటం ఇతివృత్తం. మద్దెల పంచనాదం రచనకు గవర సత్తిబాబు దర్శకత్వం వహించారు. వృకాసురుడుగా దాసరి తిరుపతి నాయుడు, మోహినిగా కేవీ పద్మావతి, లక్ష్మీదేవిగా పి.నీలవేణి, నారదుడిగా గవర సత్తిబాబు పాత్రోచితంగా నటించారు.

**ఆకట్టుకున్న ఇతివృత్తాలు**

అనంతరం టీజీవీ కళాక్షేత్రం, కర్నూలు వారి 'జగదేక సుందరి సామా' పద్యనాటకాన్ని ప్రదర్శించారు. సామా అనే వేశ్య ఎందరినో బానిసలను చేసుకుంటుంది. వేలంలో కొనుగోలు చేసిన బానిస మాఘుపై మనసు పడుతుంది. ఆమె దగ్గర బానిసలను విడిపించటానికి మాఘు ఆమెను ప్రేమిస్తున్నట్టు నటిస్తాడు. అతడి మాటలను నమ్మి బానిసలు విడుదల చేస్తుంది. ఆ వెంటనే సామా ఎదుటనే మాఘు విషం తీసుకుని మరణిస్తాడు. విరక్తి చెందిన సామా ఆత్మహత్యకు పూనుకోగా, పుణ్యకుడు అనే బౌద్ధగురువు హితబోధతో బౌద్ధసన్యాసినిగా మారుతుంది. సామాగా ప్రముఖ రంగస్థల, సినీనటి సురభి ప్రభావతి అద్భుతంగా నటించారు. ఇతర పాత్రల్లో జీవీ శ్రీనివాసరెడ్డి, కె.బాల వెంకటేశ్వర్లు, పి.రాజారత్నం నటించారు. పల్లేటి కులశేఖర్ రచనకు పద్యాలు/దర్శకత్వం పత్తి ఓబులయ్య. అనంతరం మానవత, యడ్లపాడు వారి 'అంతా మంచివారే...కానీ' సాంఘిక నాటకాన్ని ప్రదర్శించారు. రచన, దర్శకత్వం జరుగుల రామారావు. చివరగా అభ్యుదయ ఆర్ట్స్, విజయవాడ వారు 'క్రతువు' సాంఘిక నాటికను ప్రదర్శించారు. కేవీవీ సత్యనారాయణ రచనకు వేంపాటి రమేష్ దర్శకత్వం వహించారు. నాటకపోటీలను కళల కాణాచి, తెనాలి, ఆర్‌ఎస్‌ఆర్ గ్రీన్‌వే ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో కొనసాగిస్తున్నారు.



'మోహినీ భస్మాసుర'లో ఓ సన్నివేశం